


# కరపత్రం

SINCE 2014

సోమవారం మే 19 2025 సంపుటి :0 సంచిక :216 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

## గుల్జార్ హౌస్ ప్రమాద ఘటన కలచివేసింది: మోదీ

హైదరాబాద్:
చార్మినార్ పరిధి గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో పలువురి మృతి కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.



2లో..

## గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటన అత్యంత బాధాకరం: రాహుల్ గాంధీ

హైదరాబాద్:
చార్మినార్ పరిధిలోని గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాద ఘటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో పలువురు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాదంపై విచారణకు సీఎం ఆదేశం

హైదరాబాద్:
గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంపై విచారణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రమాద కారణాలపై లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం బాధాకరమని రేవంత్ అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం ప్రకటించారు.ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించటంతో భారీ ప్రాణనష్టం తప్పిందని.. అగ్నిమాపక సిబ్బంది దాదాపు 40 మందిని ప్రాణాపాయ స్థితి నుండి సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారని సీఎం రేవంత్ అన్నారు. మంటల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అగ్నిమాపక బృందం తమ శక్తియుక్తులు ప్రయత్నించిందన్నారు. కాగా, చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో ఇవాళ ఉదయం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా 17మంది మృతి చెందారు. మృతుల్లో ఏడుగురు చిన్నారులు, నలుగురు మహిళలు సహా మొత్తం 17 మంది ప్రాణాలు కోల్పోయారు.మృతి చెందిన వారిలో రాజేంద్రకుమార్ (67),అభిషేక్ మోదీ (30), సుమిత్ర (65), మున్నీబాయి (72), ఆరుషి జైన్ (17), శీతల్ జైన్ (37), ఇరాజ్ (2), హర్షాలీ గుప్తా (7), రజని అగర్వాల్, అన్య మోదీ, పంకజ్ మోదీ, వర్ష మోదీ, ఇద్దిక్కి మోదీ, రిషభ్, ప్రథమ్ అగర్వాల్, ప్రాంశు అగర్వాల్ ఉన్నారు. ఫైర్ యాక్సిడెంట్ చిన్నదే అయినా భవనంలో 30 మంది ఉండటంలో భారీ ప్రాణనష్టం జరిగింది.






## మద్యం బాబులకు బిగ్ షాక్.. తెలంగాణలో లిక్కర్ ధరలు పెంపు


హైదరాబాద్:
మందు బాబులకు తెలంగాణ ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. ఇటీవల బీర్ల ధరలు పెంచగా.. తాజాగా లిక్కర్ ధరలు హైక్ చేసింది. విస్కీ, బ్రాందీ క్వార్టర్ పై రూ.10, ఆఫ్ బాటిల్ పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.40 చొప్పున పెంచింది. ఈ మేరకు మద్యం దుకాణాలకు తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆదివారం (మే 18) సర్క్యులర్ జారీ చేసింది. ఈ పెరిగిన లిక్కర్ ధరలు 2025, మే 19 నుంచి అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.అయితే.. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా తాగే చీప్ లిక్కర్ ధరల్లో ఎటువంటి మార్పు లేదని తెలిపింది.

2లో..

## గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటనపై కేసీఆర్ దిగ్భ్రాంతి



హైదరాబాద్:
చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం పట్ల మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించి కాపాడాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తగిన ఆర్థికసాయం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## కరెంట్ షాక్ తో 14 గేదెలు మృతి.. లబోదిబోమంటున్న రైతులు

మంచిర్యాల జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కరెంట్ షాక్ తో 14 గేదెలు చనిపోయాయి. ఈ ఘటన మే 18న జరిగింది. మందమర్రి మండలం అమరావతి గ్రామానికి చెందిన సుమారు 10 మంది రైతులకి చెందిన 14 గేదెలు మృతి చెందాయి. కూరగాయల తోటల పంటకు విద్యుత్ తీగలు అమర్చారు రైతులు.అయితే ప్రమాదవశాత్తు వైర్లు పక్కనున్న చెరువులో పడిపోయాయి. నీటి కోసం చెరువులో దిగిన గేదెలకు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలగడంతో అక్కడిక్కడే మృతి చెందాయి. పాలు ఇచ్చే గేదెలు మృతి చెందడంతో కన్నీరు మున్నీరవుతున్నారు రైతులు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు రైతులు.

2 లో



## పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో అందాల భామల సందడి: తుపాకులు పట్టుకుని ఫోజులు

హైదరాబాద్:
మిస్ వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన సుందరీమణులు తెలంగాణను చుట్టేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలోని ప్రముఖ పర్యాటక స్థలాలు చార్మినార్, చౌహమహల్లా ప్యాలెస్, రామప్ప, వేయిస్థంభాల గుడి, యాదగిరి గుట్ట, పిల్లలమర్రి, ఎక్స్ పీరియం ఎకో పార్క్ వంటి స్థలాలను సందర్శించిన అందాల భామలు ఆదివారం (మే 18) హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను సందర్శించారు.

## ఉదయం పాతబస్తీ..మధ్యాహ్నం మైలార్ దేవ్ పల్లి..సాయంత్రం చర్లపల్లి..

### వరుస అగ్నిప్రమాదాలతో హడలెత్తిన హైదరాబాద్

హైదరాబాద్..
వరుస అగ్ని ప్రమాదాలతో హడలెత్తిపోయింది.ఉదయం చార్మినార్ దగ్గర గుల్జార్ హౌజ్ లో షార్ట్ సర్క్యూట్ తో మంటలు..మధ్యాహ్నం మైలార్‌దేవ్ పల్లిలో మూడంతస్తుల భవనంలో మరో అగ్ని ప్రమాదం..ఆదివారం సాయంత్రం చర్లపల్లిలో పెట్రోల్ బంక్ లో ఫైర్ యాక్సిడెంట్.. ఇలా ఆదివారం మొత్తం వరుస అగ్ని ప్రమాదాలతో హైదరాబాద్ ప్రజలు బెంబేలెత్తిపోయారు.

ఆదివారం ఉదయం పాతబస్తీ గుల్జార్‌హౌజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో చిన్నారులతో సహా 17 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలామంది తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాద ఘటనలో ఒకే




మిగతాది 2లో

కుటుంబానికి చెందిన 10మంది మృతిచెందడం అందరినీ కలచివేసింది. ప్రమాదంలో చనిపోయిన 17 మంది మృతుల్లో నలుగురు పురుషులు, ఐదుగురు మహిళలు, 8 మంది పదేళ్ల లోపు చిన్నారులు ఉన్నారు. మొత్తం70 ఫైర్ సిబ్బంది, 17 మంది అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. 8 మంది సిబ్బంది బ్రీతింగ్ అపరాటస్ ధరించి రక్షణలో పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఉగ్రమూలాల కలకలం.. పాక్‌కు సమాచారం చేరవేత?



సంగారెడ్డి:
జిల్లాలో ఉగ్రమూలాల కలకలం రేగింది. కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో అస్సాం రాష్ట్రానికి చెందిన ఇస్లాం(19) అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించే క్రమంలో షాకింగ్ విషయాలు బయడపడినట్లు తెలుస్తోంది. అస్సాం పోలీసుల ఆపరేషన్ ఘోస్ట్ సిమ్ లో భాగంగా ఇస్లాం బాగోతం వెలుగులోకి వచ్చింది.అస్సాంలో గుర్తింపు కార్డులు లేకుండా సిమ్ కార్డులు తీసుకుని సంగారెడ్డి జిల్లాలో పలువురికి విక్రయిస్తున్నట్లు తెలిసింది. గతంలో అస్సాంలో మొబైల్ షాపులో పని చేసిన ఇస్లాం.. అక్కడే కొందరి గుర్తింపు కార్డులతో నకిలీ సిమ్ లు తీసుకుని అధిక ధరకు విక్రయించాడు.ప్రస్తుతం గొల్లపల్లిలో తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అదే సమయంలో తన వద్ద ఉన్న నకిలీ సిమ్ కార్డులను పాకిస్తానీయులకు అమ్మినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. భారత్ ఫోన్ నెంబర్లతో పాకిస్తాన్ లో వాట్సాప్ అకౌంట్ లు క్రియేట్ కావడంతో ఈ కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు పోలీసులు.

మిగతాద్ది 2 లో

## కేంద్రం ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చెయ్యాలి: బండి సంజయ్



హైదరాబాద్..
కేంద్రం తెలంగాణకు ఇచ్చిన నిధులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు కేంద్రమంత్రి బండి సంజయ్. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేస్తేనే అభివృద్ధి కానీ ఇక్కడి ప్రభుత్వం కేవలం విమర్శలకే పరిమితమవుతోందన్నారు. దీనివల్ల తెలంగాణ రాష్ట్రం నష్టపోతోందన్నారు. మీడియాతో మాట్లాడిన బండి సంజయ్..మే 22న దేశ వ్యాప్తంగా 102 రైల్వే స్టేషన్లను ప్రధాని మోడీ వర్చువల్ గా ప్రారంభిస్తారని చెప్పారు. తెలంగాణలోని బేగంపేట, వరంగల్, కరీంనగర్ రైల్వే స్టేషన్లను కూడా మోడీ ప్రారంభిస్తారన్నారు. తెలంగాణలో 2 వేల కోట్లతో 40 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ల స్కీం కింద అభివృద్ధి చేస్తున్నాం. కేవలం 21 నెలల్లో కరీంనగర్ అభివృద్ధి పనులు 95 శాతం పూర్తి చేశాం.

మిగతాది 2లో

## రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ పోటీలకు యూనివర్సల్ స్కూల్ విద్యార్థి ఎంపిక:



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

గతనెల ఏప్రిల్ 27 తారీకు ఆదివారం గోదావరిఖని ప్రభుత్వ పీజీ ,డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి సాఫ్ట్బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 19 నుండి 21 వరకు మెదక్ జిల్లా తూప్రాన్ లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ పోటీలకు యూనివర్సల్ విద్యార్థి గౌరీక్ ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా గౌరిక్ ను పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయులు అఫ్జల్ అభినందించారు.

## జొన్నల రవీందర్ కు 2025 గోదావరి కళా రత్న పురస్కార్ అవార్డు:





కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

అంతర్గాం మండలం గోలీవాడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో ప్రధాన ఉపాధ్యాయులుగా విధులు,నిర్వహిస్తున్న పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్చరల్ అకాడమీ ప్రధాన కార్యదర్శి జొన్నల రవీందర్ ముదిరాజ్ కు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక విభాగం , గోదావరి కళా సంఘాల సమైక్య సంయుక్తంగా నిర్వహించిన కళోత్సవాలలో, 2025 వ సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన, గోదావరి కళా రత్న పురస్కార్ అవార్డును అందజేశారు. గోదావరిఖని పట్టణంలోని ఆర్ సి ఓ ఏ క్లబ్లో గోదావరి కళా సంఘాల సమైక్య ఆధ్వర్యంలో 37వ వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక కళా రంగాలలో కృషి చేస్తున్న కొంతమంది సామాజిక సేవకులకు రామగుండం శాసనసభ్యులు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కళా సంస్థ అధ్యక్షులు కనకం రమణయ్య, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, తెలంగాణ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ, ఈర్ల జాన్, సామెల్ తార ఆర్ట్ అకాడమీ, వ్యవస్థాపక అధ్యక్షులు, సంకె రాజేష్,,చేతుల మీదుగా సంస్థ పురస్కారాలు అందజేసింది. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా కొనసాగుతూనే స్కౌట్ మాస్టర్ గా 30 సంవత్సరాలుగా అనేక సామాజిక సేవలు కళా రంగంలో సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్చరల్,అకాడమీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. జొన్నల రవీందర్ కు ప్రతిష్టాత్మకంగా గోదావరి కళా రత్న పురస్కార్ అవార్డు అందుకోవడం పట్ల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్చరల్ అకాడమీ జాతీయ గౌరవ అధ్యక్షులు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, సీనియర్ జర్నలిస్టు, జాతీయ అధ్యక్షులు బొంకూరి మధు, ముఖ్య సలహాదారులు సూర్యదేవర వెంకటేశ్వరరావు, సూర్యదేవర జ్యోతి శుభాకాంక్షలు తెలిపారు.

## గుడ్ న్యూస్.. ఈ హైవే ఎక్కితే హైదరాబాద్ TO వైజాగ్ 8 గంటలే..



ఆంధ్ర-తెలంగాణను కలుపుతూ కేంద్రం నిర్మిస్తోన్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే 365-BG ప్రారంభానికి సిద్ధమవుతోంది. పచ్చని పొలాల మధ్యలో నుంచి ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణం సాగించవచ్చు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ నుంచి విశాఖకు రయ్రయ్మంటూ దూసుకెళ్లవచ్చు.సూర్యాపేట నుంచి ఖమ్మం చేరుకోగానే ఈ రహదారి ప్రారంభం అవుతుంది. అది ఖమ్మం నుంచి తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి వరకు ఉంటుంది. 4 వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవేను పచ్చని పొలాల మధ్య ఏర్పాటు చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం 31 గ్రామాల్లో 19వందల 96 ఎకరాలను కేంద్ర ప్రభుత్వం సేకరించింది. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిని హైదరాబాద్ - విశాఖ మధ్య దూరం తగ్గించేందుకు నిర్మిస్తున్నారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే 676 కిలోమీటర్లు, సుమారు 12 గంటలపాటు ప్రయాణించాలి. ప్రధానంగా విజయవాడ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ కొత్త రహదారి పూర్తయితే విజయవాడ వెళ్లకుండానే విశాఖకు వెళ్లిపోవచ్చు. సుమారు 125 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. ఏడెనిమిది గంటల్లోనే విశాఖ నుంచి హైదరాబాద్ చేరుకోవచ్చు. ఇక ఈ హైవే స్పెషాలిటీస్ ఏంటో తెలుసుకుందాం..రూ. 4,609 కోట్ల వ్యయంతో హైవే నిర్మాణం చేస్తున్నారు. ఇది 4 లేన్లతో కూడిన రహదారి. 162 కి.మీ. దూరంలో 8 చోట్ల మాత్రమే ఎంట్రీ పాయింట్స్ ఉన్నాయి. తెలంగాణలో ఖమ్మం, వైరా, కల్లూరు, సత్తుపల్లి.. ఏపీలో తిరువూరు, జంగారెడ్డిగూడెం, గురవాయిగూడెం, దేవరపల్లి వద్ద ఎంట్రీ పాయింట్స్ ఉంటాయి. ఏపీ పరిధిలో 4 చోట్ల టోల్ప్లాజాలు, విశ్రాంతి కేంద్రాలు ఉంటాయి. 117 అండర్పాస్లు, 33 కల్వర్టులు, 9 భారీ వంతెనలు మీదుగా ఈ ప్రయాణం సాగుతుంది.ఖమ్మం జిల్లా పరిధిలో తల్లంపాడు నుంచి వేంసూరు వరకు 105 కిలోమీటర్ల మేర ఈ గ్రీన్ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతోంది. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పనుల పురోగతిని పరిశీలించారు. ఆగస్టు 15 నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులలను ఆదేశించారు. ఇండిపెండెన్స్ డేకల్లా ఈ హైవేపై వాహనాలు జోరుగా దూసుకుపోనున్నాయి. భారత్ మాల ఎకనామిక్ కారిడార్ పథకం కింద NH-365BG పేరిట ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే రూపుదిద్దుకుంటోంది.

## పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో అందాల భామల సందడి: తుపాకులు పట్టుకుని ఫోజులు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, మహిళలు పిల్లలపై వేధింపుల నివారణ, డ్రగ్స్ కట్టడికి చేపట్టిన చర్యలు, నేరాల నియంత్రణ, నేర నివారణలో ఉపయోగిస్తున్న ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులు తదితర అంశాలపై తెలంగాణా పోలీస్ శాఖ చేపట్టిన పటిష్టమైన చర్యలపట్ల మిస్ వరల్డ్ కాంటెస్టర్లు సంతృప్తిని వ్యక్తం చేశారు. డ్రగ్స్ నివారణకై తెలంగాణా పోలీస్ చేపట్టిన చర్యలకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ పోస్టర్లపై సంతకాలు చేసి పలు మెసేజ్లను కూడా రాశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు విధానాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు.ముందుగా బంజారాహిల్స్లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్కు చేరుకున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్లకు పోలీస్ అశ్విక దళం, పైపు బ్యాండ్, మోటర్ సైకిల్ రైడర్స్, స్నిఫ్ఫర్ డాగ్ స్క్వాడ్లతో పోలీస్ శాఖ ఘన స్వాగతం పలికింది. అనంతరం పోలీస్ కమాండ్ కంట్రోల్ ఆడిటోరియంలో పోలీస్ శాఖ అమలు చేస్తోన్న పలు విధానాలు, అవి పనిచేసే విధానంపై అందాల భామలకు ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పటిష్టమైన విధానాలవల్ల రాష్ట్రంలో 17 శాతం నేరాలు తగ్గాయని, వివిధ అంశాలలో తెలంగాణా పోలీస్ కు అంతర్జాతీయ అవార్డులు కూడా లభించాయని వారికి చెప్పారు.దేశంలో మరెక్కడా లేని విధంగా ట్రాన్స్ జెండర్ల సేవలను ట్రాఫిక్ విభాగంలో ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. మొత్తం ప్రపంచానికే సవాలుగా మారిన సైబర్ నేరాల నియంత్రణలో అత్యంత ఆధునిక టెక్నాలజీని వాడుతున్నామని, లక్షల సంఖ్యలో ఏర్పాటు చేసిన సీసీ టీవీల వల్ల, రాష్ట్రంలో ఎక్కడ నేరం జరిగినా వెంటనే తగు చర్యలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా సేఫ్టీ టూరిజంలో తెలంగాణా అత్యంత సురక్షితమైనది, ఇందుకు తెలంగాణా పోలీస్ చేపట్టిన పటిష్టమైన చర్యలే కారణమని వివరించారు. ఈ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీసు ఆయుధాల ప్రదర్శన, అక్టోపస్, గ్రే హౌండ్స్, పోలీస్ జాగిలాల ప్రదర్శనలు, పైప్ బ్యాండ్, అశ్విక దళంలను కాంటెస్టర్లు ఆసక్తిగా పరిశీలించారు. సెల్ఫీలను దిగారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను నిరంతరం పరిశీలించే అత్యాధునిక కమాండ్ కంట్రోల్ గదిలో ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సర్వేలెన్స్ ఫీడ్లు, తక్షణమే స్పందించే వ్యవస్థను మిస్ వరల్డ్ కాంటెస్టర్లు స్వయంగా పరిశీలించారు. జీవ ప్రమాణాలు పెంపొందించడం, సురక్షిత టూరిజంకు, రాష్ట్ర అభివృద్ధికి భద్రతా చర్యలు ఎంతటి కీలక పాత్ర వహిస్తాయో తెలంగాణా పోలీస్ను ఉదాహరణ చెప్పవచ్చని మిస్ వరల్డ్ కాంటెస్టర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం, మరే రాష్ట్రంలో లేని విధంగా, ట్రాఫిక్ నియంత్రణా చర్యలకు సేవలందిస్తున్న ట్రాన్స్ జెండర్లతో కలసి మిస్ వరల్డ్ కాంటెస్టర్లు ఫోటో దిగారు.

## మద్యం బాబులకు బిగ్ షాక్.. తెలంగాణలో లిక్కర్ ధరలు పెంపు

మొదటి పేజీ తరువాయి

బీర్ల ధరలు భారీగా పెరగడంతో చాలా మంది మందు బాబులు విస్కీ, బ్రాందీకి మారారు. తాజాగా లిక్కర్ ధరలు కూడా పెరగడంతో మద్యం ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. ఆదాయం పెంపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం లిక్కర్ రేట్లను సవరించినట్లు తెలుస్తోంది.కాగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్రంలో బీర్ల ధరలను ప్రభుత్వం 15 శాతం పెంచిన విషయం తెలిసిందే. రిటైర్డ్ జడ్జి జైస్వాల్ నేతృత్వంలోని లిక్కర్ధరల నిర్ణయ త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా ఎక్సైజ్ శాఖ ధరల పెంపు ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు ఇచ్చింది. 15 శాతంగా లెక్కిస్తే ఒక్క బీరు ధర రూ. 150 ఉంటే వ్యాట్, ఎక్సైజ్ సుంకంతో కలిపి రూ. 180 దాకా పెరగనుంది. ఎక్కువ రేట్లు ఉన్న బీర్లు.. మరింత పెరగనున్నాయి. వాస్తవానికి రాష్ట్రంలో మద్యం ధరలు పెంచొద్దని ముందుగా నిర్ణయం తీసుకున్నప్పటికీ.. పక్క రాష్ట్రాల్లో ధరలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్రంలో మద్యం ధరలను ప్రధానంగా బీర్ల ధరలు పెంచాలని లిక్కర్ కంపెనీలు గత కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్చేస్తున్నాయి. రాష్ట్ర మద్యం మార్కెట్లో దాదాపు 60 శాతం వాటా ఉన్న మల్టీనేషనల్ బీర్ల కంపెనీ తమకు ప్రస్తుతం చెల్లిస్తున్న బేసిక్ ధర మీద కనీసం 30.1 శాతం అదనపు ధర చెల్లించాలని కోట్ చేసింది.

ఈ కంపెనీ డిమాండ్నే మిగితా కంపెనీలూ అనుసరించాయి. ఈ నేపథ్యంలోనే త్రిసభ్య కమిటీ కూడా ధరలను 15 నుంచి 19 శాతం పెంచేందుకు నివేదిక ఇవ్వగా.. 15 శాతం బీర్ బేసిక్ ధర పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. తాజాగా లిక్కర్ ధరలను పెంచింది.

## ఉదయం పాతబస్తీ..మధ్యాహ్నం మైలార్ దేవ్ పల్లి..సాయంత్రం చర్లపల్లి..

మొదటి పేజీ తరువాయి

పాతబస్తీ గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. ఇక ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించింది.

గౌతమ్ నగర్ కు వెళ్లిన మీడియా పైన పోలీసుల పైన మృతుల కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల వివరాలు నోట్ చేస్తుండగా ఆగ్రహంతో సీఐపై దాడి చేశారు మృతుల బంధువులు. మీడియాను కూడా అనుమతించలేదు.

### మైలార్ దేవ్పల్లిలో మూడంతస్తు భవనంలో మంటలు

మైలార్ దేవ్పల్లిలో మూడంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటల చెలరేగాయి. పెద్దఎత్తున మంటలు ఎగిపపడ్డాయి. మెట్ల దగ్గరే మంటలు చెలరేగడంతో కిందికి దిగే మార్గం లేక భవనంలోని నివాసితులు టెర్రస్ పైకి ఎక్కి సాయం కోసం హాహాకారాలు చేశారు. ప్రమాద సమయంలో దాదాపు50 మంది భవనంలో ఉన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మూడు ఫైరింజన్లతో మంటలార్పారు. లాడర్స్ ద్వారా టెర్రస్ పై ఉన్న వారిని కిందికి దించడం పెద్దప్రమాదం తప్పింది.

### చర్లపల్లిలో ఐఓసీ దగ్గర అగ్నిప్రమాదం...

ఆదివారం సాయంత్రం చర్లపల్లి లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ దగ్గర పెట్రోల్ ట్యాంకర్ లో అనుకోకుండా మంటలు చెలరేగాయి. పక్కకు నిలిపేందుకు డ్రైవర్ ప్రయత్నిస్తుండగా..ఫుల్ ట్యాంక్ పెట్రోల్ ట్యాంకర్ తోపాటు మరో గ్యాస్ ట్యాంకర్లకు మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించడంతో మంటలను అదుపులోకి వచ్చాయి.. ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

## కరెంట్ షాక్ తో 14 గేదెలు మృతి..

## లబోదిబోమంటున్న రైతులు

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్రెడ్డికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫోన్ చేశారు. గుల్జార్హౌస్ అగ్నిప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును సీఎం ఆయనకు వివరించారు. ఎప్పటికప్పుడు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఘటనాస్థలికి మంత్రులు వెళ్లినట్లు చెప్పారు. గుల్జార్హౌస్లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్పేట), డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు.

## గుల్జార్ హౌస్ ప్రమాద ఘటన కలచివేసింది: మోదీ

మొదటి పేజీ తరువాయి

**క్షతగాత్రులకు రూ.50 వేల పరిహారం అందిస్తామన్నారు.గుల్జార్హౌస్లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్పేట), డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం.గుల్జార్హౌస్ అగ్నిప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు**

## గుల్జార్హౌస్ అగ్నిప్రమాద ఘటనపై కేసీఆర్ దిగ్భ్రాంతి

మొదటి పేజీ తరువాయి

### ప్రమాద బాధితులకు పార్టీ అండగా ఉంటుంది: కేటీఆర్

గుల్జార్ హౌస్లో జరిగిన అగ్నిప్రమాద ఘటన చాలా బాధాకరమని, ఇది తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రమాద బాధితులకు తమ పార్టీ అన్నిరకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనాస్థలి వద్ద భారాస బృందం అందుబాటులో ఉండి సహాయ కార్యక్రమాలు చేస్తోందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కేటీఆర్.. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### రూ.25 లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా ప్రకటించాలి: హరీశ్రావు

అగ్నిప్రమాద ఘటన చాలా బాధాకరమని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంటల్లో చిక్కుకున్న కుటుంబాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో, హైదరాబాద్ నగరంలో వరుస అగ్ని ప్రమాద ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో దారుణంగా విఫలమవుతోందన్నారు. వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు వ్యూహం అనుసరించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని ఆరోపించారు. అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని హరీశ్రావు డిమాండ్ చేశారు.

## సంగారెడ్డిలో ఉగ్రమూలాల కలకలం.. పాక్కు సమాచారం చేరవేత?

మొదటి పేజీ తరువాయి

ఇటీవల జరిగిన భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధంలో భాగంగా మీడియాలో వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నట్లు సమాచారం.

### దేశ వ్యాప్తంగా ఏడుగురు అరెస్ట్.. అంతా అస్సాం వారే

ఆపరేషన్ ఘోస్ట్ సిమ్ లో భాగంగా దేశ వ్యాప్తంగా ఏడుగుర్ని పోలీసులు అదుపులోకి తీసుకోగా, అంతా అస్సాం రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ఈ ఏడుగురు అనుమానితులు వివిధ రాష్ట్రాల్లో ఉంటూ దేశ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పాకిస్తాన్ లోని తమ మిత్రులకు సమాచారం చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి సంగారెడ్డిలో మకాం వేసిన అస్సాం పోలీసులు తమ దర్యాప్తును అత్యంత గోప్యంగా సాగిస్తున్నట్లు సమాచారం.

## కేంద్రం ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చెయ్యాలి: బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి

కరీంనగర్ రైల్వే స్టేషన్ ను సర్వాంగ సుందరంగా అన్ని రకాలుగా అభివృద్ధి చేశాం. త్వరలోనే జమ్మికుంట రైల్వే స్టేషన్ కూడా ఆధునికీకరిస్తాం. కరీంనగర్ - తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులు కూడా త్వరలోనే పూర్తవుతాయి. హుజురాబాద్ నియోజకవర్గంలోని ఉప్పల్ ఆర్వోబీ పనులు కూడా తొందరగా పూర్తి చేయాలని ఆదేశించాం. తెలంగాణలో జరుగుతున్న పనులకు ఖర్చు చేస్తున్న నిధులన్నీ కేంద్రానివే. తెలంగాణలో రూ. 32 వేల 950 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు చేస్తున్నాం. రూ. 750 కోట్లతో సికింద్రాబాద్, రూ. 350 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేస్తున్నాం. ఒక్క ఏడాదిలోనే 5 వేల కోట్ల రైల్వే పనులు చేపట్టాం. ఇంత చేస్తున్నా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు కేంద్రం ఏమీ చేస్తలేదని ఆరోపిస్తున్నారు. లక్షన్నర కోట్లు నేషనల్ హైవే కోసం ఖర్చు చేస్తున్నా.. ఏమీ చేయడం లేదని అనడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని బస్టాండ్లు అభివృద్ధి చేసిందో చెప్పాలి. రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయడానికి మేం సిద్దం..రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమా అని సవాల్ విసిరారు బండి సంజయ్.

# జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్!

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

- పాత పద్ధతిలోనే సినిమాల ప్రదర్శన కోరుకుంటున్న థియేటర్ల యజమానులు
- పాత రోజుల్లో సినిమా ప్రదర్శనకు పెట్టెలు అద్దెకు తెచ్చి నడుపుకునే వారు
- లాభ నష్టాల గోల ఎందుకని థియేటర్లు అద్దెకు ఇచ్చి చేతులు దులుపుకున్న ఎగ్జిబిటర్లు మళ్ళీ పాత పద్దతినే కోరుకుంటున్నారు
- సినిమా లవర్స్‌కు షాక్



జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు తెలుగు రాష్ట్రాల ఫిల్మ్ ఎగ్జిబిటర్లు.ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేమంటున్న ఎగ్జిబిటర్లు.. పర్సంటేజ్ రూపంలోనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఈ మేరకు నిర్మాతలకు లేఖ రాయాలని ఎగ్జిబిటర్లు తీర్మానం చేశారు.**

ఫిల్మ్ చాంబర్‌లో జరిగిన ఎగ్జిబిటర్ల సంయుక్త సమావేశానికి దిల్‌రాజు, సురేష్‌బాబుతో పాటు 60 మంది ఎగ్జిబిటర్లు అటెండ్ అయ్యారు.చాలా రోజులుగా తెలుగు ఇండస్ట్రీలో ఎగ్జిబిటర్లు, నిర్మాతలకు మధ్య పర్సంటేజ్ యుద్ధం నడుస్తూనే ఉంది.తమకు పర్సంటేజ్ సిస్టమ్‌లో సినిమాలు విడుదల చేయాలని ఎగ్జిబిటర్లు పట్టు పడుతుంటే, అలా చేస్తే తమకు నష్టం వస్తుందని నిర్మాతలు కూడా ఏం మాట్లాడటం లేదు.ఇప్పుడు ఈ వార్ ముదిరి పాకాన పడింది. తాజాగా ఫిల్మ్ ఛాంబర్‌లో తెలుగు రాష్ట్రాల్లోని ఎగ్జిబిటర్లు ఓ మీటింగ్ ఏర్పాటు చేసారు. ఈ మీటింగ్‌కు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 60 మంది ఎగ్జిబిటర్లు హాజరయ్యారు.అందులో సురేష్ బాబు, దిల్ రాజు లాంటి అగ్ర నిర్మాతలు కూడా ఉన్నారు. ఈ మీటింగ్‌లో తమ డిమాండ్స్ ఛాంబర్ ముందు పెట్టారు ఎగ్జిబిటర్లు. ప్రస్తుతం నడుస్తున్న అద్దె ప్రాతిపదికన థియేటర్లు నడిపే పరిస్థితుల్లో తాము లేమని చెప్పేసారు థియేటర్ యాజమాన్యం. అలా చేస్తే నష్టాలు వస్తున్నాయంటున్నాయని.. థియేటర్స్ నడపలేని స్టేజీలోకి వెళ్లిపోయామని తమ కష్టాలు చెప్పుకున్నారు.పర్సెంటేజ్ ప్రకారం అయితేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని ఎగ్జిబిటర్లు ఓ తీర్మానం చేసుకున్నారు. ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లలో సినిమాల ప్రదర్శన పర్సెంటేజ్ ప్రకారమే జరుగుతుంది. అందులో నిర్మాతలు, మల్టీప్లెక్స్ యాజమాన్యం ఓ ఒప్పందం ప్రకారం సినిమాలు ప్రదర్శిస్తున్నారు. కానీ సింగిల్ స్క్రీన్స్‌కు ఈ ప్రతిపాదన లేదు. అక్కడంతా అద్దె సిస్టమే నడుస్తుంది. అలా చేస్తే పెద్ద సినిమాలు విడుదలైనపుడు తమకు నష్టం వస్తుందంటున్నారు ఎగ్జిబిటర్లు. అప్పుడు నిర్మాతలకే లక్షలకు లక్షలు చెల్లించాల్సి వస్తుందంటున్నారు. ఈ మేరకు ఛాంబర్ కూడా స్పందించి నిర్మాతలకు లేఖ రాయనుంది. ఈ క్రమంలోనే జూన్ 1 నుంచి థియేటర్స్ బంద్ చేయాలని నిర్ణయించుకున్నారు ఎగ్జిబిటర్లు.మరి దీనిపై నిర్మాతల రియాక్షన్ ఎలా ఉండబోతుందో చూడాలి. అన్నట్లు ఈ మీటింగ్‌కు ఇండస్ట్రీలో ఉన్న చాలా మంది నిర్మాతలు కం ఎగ్జిబిటర్లు హాజరు కాలేదు.సురేష్ బాబు, దిల్ రాజు మాత్రమే హాజరయ్యారు. మరి ఈ చర్చలు ఫలిస్తాయా లేదా అని అందరిలో ఆసక్తి నెలకొన్నది.సినిమాల విడుదల ఎగ్జిబిటర్ల చేతిలోకి వస్తే చిన్న సినిమాలకు థియేటర్లు దొరికి పరిశ్రమకు మంచి కాలం వస్తుందన్న అభిప్రాయం వినిపిస్తున్నది.జూన్ 1 నుంచి థియేటర్స్ ఫ్యూచర్ ఎలా ఉండబోతుందో చూడాలి.

# మళ్ళీ పెరిగిన మద్యం ధరలు
# తాగితే ఉయ్యాల ఊగితే జంపాల

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

- రాష్ట్ర ప్రభుత్వం తాగుబోతులకు ఉయ్యాల జంపాల ఆట గుర్తు చేస్తున్నది.
- ఈ మందు ధరల పెంపుదల 1977 లో వచ్చిన ఎదురీత సినిమాలోని ఎన్టీఆర్ పాటను గుర్తు చేస్తున్నది

తాగితే ఉయ్యాల ఊగితే జంపాల
తాగితే తంటారా..తాగకుంటే ఎట్టారా..
తాగి ఊగి ఊరేగి తైతక్కలాడర నాయాల..
అంటూ ఎన్టీఆర్ అప్పట్లో పాడిన పాట ఎప్పటికీ ఎవర్ గ్రీన్.

ప్రభుత్వం ఆశయం కూడా తాగిపించడమే..
జనం తాగాలి, ఖజానా నిండాలి..




- భారీగా పెరిగిన మద్యం ధరలు.. లేటెస్ట్ రేట్లు ఇవే

తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మందుబాబులకు బిగ్ షాక్ ఇచ్చింది.
మద్యం ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.
మద్యం ధరలను పెంచుతున్నట్లు ఎక్సైజ్ శాఖ లిక్కర్ దుకాణాలకు సర్క్యులర్ జారీ చేసింది. ఫుల్ బాటిల్ పై రూ.40 మేర ధర పెంచుతున్నట్లు ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది..2020లో అప్పటి ప్రభుత్వం



స్పెషల్ ఎక్సైజ్ సెస్‌ను ప్రవేశపెట్టింది. దాని ప్రకారం మద్యం బాటిళ్లపై సెస్‌ను పెంచారు.. అయితే స్పెషల్ ఎక్సైజ్ సెస్‌ను ఎక్సైజ్ శాఖ మళ్లీ ఇప్పుడు పునరుద్ధరిస్తూ చర్యలు తీసుకుంది.ఈ కొత్త ఒప్పందం జులై 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది.ఈ లోపే మద్యం ధరలు పెంచి డిస్టిలరీలు, డిస్ట్రిబ్యూటర్లు, సప్లై కంపెనీతో ఒప్పందాలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## ప్రజల దాహమూర్తి తీర్చిన మాజీ సర్పంచ్



-కాలనీలో చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించిన మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య

**యైటీంక్లయిన్ కాలనీ కరపత్రం ప్రతినిధి**
రామగిరి మండలం ముస్త్యాల గ్రామం ఎస్సీ కాలనీలో రెండు బోర్లు చెడిపోవడంతో కాలనీ వాసులు మంచినీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్యని బోర్లు మరమ్మత్తులు చేయించమని అడగగా మానవతా దృక్పథంతో సానుకూలంగా స్పందించి పదవి ఉన్నా లేకున్నా గ్రామ సేవే నా లక్ష్యం అని ఆదివారం మరమ్మతులు చేయించి కాలనీవాసుల మన్ననలు పొందారు. లావణ్య మాట్లాడుతూ నేను పదవిలేని కాలంలోనే ప్రజాసేవ చేశానని ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకొన్నానని అలాగే నాకు పదవి ఉన్నా లేకున్నా, నేను గ్రామ సేవ చేయడంలో ముందు ఉంటాననిన్నారు. ముందు ముందు గ్రామ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తోడుగా ఉంటానని అన్నారు. బోర్లు మరమ్మతులు చేయించడం పై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

# హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత

- హంపి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి

గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి
హిందు ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత అని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలోని పాలరేవు గోదావరి నది తీరం లోని వేములకుర్తి అలయకమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారాన్ని తిసుకోని అలయ గర్భగుడి ముందు నుతన మండపం,ఆలయం లో అన్నపూర్ణ దేవి మాత నూతన విగ్రహం, ఏకశిల



ప్రవచనాలు బోధిస్తున్న హంపి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతీ స్వామి

ధ్వజస్థంబ పునః ప్రతిష్ట కార్యక్రమాలు జరగగా హంపి పీఠాధిపతి పారంభించి భక్తులకు పలు ప్రవచనాలు భోదించారు.హిందూ ధర్మం పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని, ఆలయాల అభివృద్ధి చేసుకోవాలన్నారు.ప్రతి 12 సవత్సరాలకోసారీ కుంబాభిషేకం చేసుకొని ఆలయాలు పరిరక్షించుకోవాలన్నారు.అనంతరం ఆలయం లో భక్తులకు ప్రసాధం పంపిణీ చేశారు. అందరు భక్తులు స్వామి వారి దర్శనం చేసుకున్నారు.ఈకార్యక్రమంలో చౌట్ పల్లి యజ్ఞ అర్చకులు శ్రీ కప్పగంతుల గంగా ప్రసాద్ దీక్షిత్,ఆలయ అర్చకులు మంత్రరాజం శ్రీనివాసాచార్యులు, మంత్ర రాజం జానకీ రామకృష్ణాచార్యులు, శివ కూమార్ శర్మ, శితి కంఠ శర్మ, రాజా గౌతమ్ శర్మ, గణేష్ శర్మ, ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఆంజన్నకు పంచామృతాభికం



**బెజ్జంకి, కరపత్రం ప్రతినిధి**
మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో ఆదివారం హనుమాన్ దీక్ష స్వాముల హనుమాన్ టెంపుల్ లో ఆలయ ప్రధాన అర్చకులు, కాచం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్వామివారికి చందన, పంచామృత, పలాభిషేకం, నవగ్రహా పూజ నిర్వహించి అనంతరం పంచముఖ హనుమాన్ హెూమం నిర్వహించారు. గ్రైపల్లి శ్రీనివాస్ అన్నాడి శ్రీనివాసరెడ్డి, కట్టు కోజ్వల సదానందం, ఏలేటి అనిల్ రెడ్డి, జిపి కార్యదర్శి పాము రాజేంద్రప్రసాద్ హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ వర్కర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ఎన్నిక.

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ మే 18**
హుజురాబాద్: హుజురాబాద్ వాకర్ అసోసియేషన్ ఎన్నికలకు ఎన్నికల అధికారులు రెండు బూత్ లు ఏర్పాటు చేయాగ, మొత్తం 926 ఓటర్లకు 607 ఓట్లు పోలయ్యాయి. పోలీస్ బందోబస్త్ మధ్య ఎన్నికలు స్థానిక హై స్కూల్ గ్రౌండ్ లో పోటాపోటీగా జరగగా ఎట్టకేలకు ఓటింగ్ ప్రక్రియ ముగియడంతో నూతన పాలకవర్గం కోలువు తీరింది. ఈరోజు ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ముగ్గురు EC మెంబర్లకు ఉదయం నుంచి 11 గంటల వరకు నిర్వహించగా మధ్యాహ్నం కల్లా ఫలితాలు వెల్లడయ్యాయి. అధ్యక్షుడిగా కొమురవెల్లి హరిప్రసాద్, ఉపాధ్యక్షుడుగా మండల యాదగిరి, కోశాధికారిగా చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి గతంలోనే ఏకగ్రీవం కావడంతో ఉత్కంఠగా సాగాల్సిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ప్రధాన కార్యదర్శికి మక్కపల్లి





రమేష్(230), బుర్ర కుమార్(97), MA మతీన్(250) పోలవగా మతిన్ 20 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సహాయ కార్యదర్శిగా కుడికల ప్రభాకర్(290), కోట సంపత్(306) ఓట్లు రాగా నోటాకు 11 పోలయ్యాయి. 16 ఓట్ల మెజార్టీతో కోట సంపత్ గెలుపొందారు. అలాగే EC మెంబర్లుగా కుడికాల ప్రభాకర్(311), కందల రమేష్(438), ముషం రాజేంద్రము(473), తేలుకుంట్ల వేణు(347) ఓట్లు పోలయ్యాయి. దీంతో ముగ్గురు గెలుపొందగా తక్కువ ఓట్లు వచ్చిన ప్రభాకర్ ఓడిపోయారు. ఈ పదవులకు పోటాపోటీగా ఓట్లు రావడంతో కౌంటింగ్ ముగిసేంతవరకు ఉత్కంఠ నెలకొంది. వారం రోజుల ఉత్కంఠకు నూతన పాలకవర్గం ఎన్నికతో ముగింపు పలికినట్లు అయింది. అధ్యక్షుడుగా కొమురవెల్లి హరిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మండల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఎంఏ మతిన్, కోశాధికారిగా చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కోట సంపత్, డైరెక్టర్లుగా ముషము రాజేంద్రము, కందల రమేష్, తేలుకుంట్ల వేణుల ఎన్నికతో వాకర అసోసియేషన్ నూతన పాలకవర్గం పూర్తిస్థాయిలో ఏర్పాటయింది. గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల నిర్వహణ కమిటీ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ఇలాసాగరం వీరస్వామి, ఇతర ఎన్నికల అధికారులు గెలుపు పత్రాలను అందజేశారు.

# విద్యుత్ షాక్ తో ఆవు మృతి


**కోనరావుపేట,కరపత్రం ప్రతినిధి**
విద్యుత్ షాక్ తో పాడి ఆవు మృతిచెందిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కనగర్తి లో జరిగింది.బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం... కనగర్తి



గ్రామానికి చెందిన బడే స్వామిదాసు తన వ్యవసాయ క్షేత్రం వద్ద గోవులను పోషిస్తున్నాడు.స్వామిదాసు రోజుమాదిరిగానే తన ఆవులను పొలం వద్ద మేతకు కట్టేశాడు.ఒక ఆవు గ్రామశివారులోని కనకదుర్గ రైస్మిల్ వద్ద మేస్తుండగా తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ కు ఎలాంటి కంచే లేకుండా ఉండడంతో విద్యుత్ షాక్ కు గురై ట్రాన్స్ ఫార్మర్ వద్ద మృతి చెంది ఉంది.ఆదివారం ఉదయం గమనించిన బాధిత రైతు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని పరిశీలించారు.బాధిత రైతుకు సుమారు రూ.50 వేల నష్టం జరిగినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.విద్యుత్ షాక్ తో మృతిచెందిన ఆవు

# సామాజిక మాధ్యమాల వ్యసనం - యువత మీద ప్రభావం

**18-5-2025 కరపత్రం ప్రతినిధి**
ప్రపంచంలో యువత అత్యధికంగా ఉన్న దేశం భారతదేశం. దాదాపు 66 శాతం మంది 25 నుంచి 30 మధ్య వారు ఉన్నారు. ఈరోజు యువతే రేపటి నాయకులు అని అన్నారు నెల్సన్ మండేలా. లేవండి, మేల్కొనండి మరియు లక్ష్యం చేరేవరకు ఆగకండి అని స్వామి వివేకానంద యువతను ఉద్దేశించి అన్న మాటలు చాలా మందిని ఉత్తేజితం చేశాయి. దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా యువత యొక్క శక్తి గురించి ఎన్నో సార్లు వ్యాఖ్యానించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది అనడానికి ఏ మాత్రం ఆలోచించక్కర్లేదు. యువత మొత్తం ఒక వైపు నిలబడితే ఆ వైపు ఉన్న రాజకీయ పార్టీ అత్యధిక మెజారిటీతో గెలుస్తుంది. అంటే యువత తలుచుకుంటే ఒక నాయకుడిని నిలబెట్టగలదు. అందుకే ఏ పార్టీ అయినా ముందుగా యువతను లక్ష్యంగా చేసుకుని హామీలు ఇస్తుంది. ఒక గొప్ప వ్యాపారవేత్త, శాస్త్రవేత్త, తత్వవేత్త, రాజకీయ నాయకుడు, కథానాయకుడు, మరియు ఉపాధ్యాయుడు లాంటి ఎంతో మంది ఉద్భవించేది యువత నుంచే. ఇవే కాదు ఇంకా ఎన్నో వేల రకాల రంగాలలో సంచలనం శ్రుష్టించిన ప్రతీ వ్యక్తి తన ప్రయాణం మొదలు పెట్టింది యువ వయసు నుంచే. అంత శక్తి వంతమైన యువత నేడు అతి దుర్భరమైన పరిస్థితులలో ఉంది. సామాజిక మాధ్యమాల వలలో పడి తన భవిష్యత్తు గురించి ఆలోచించలేని స్థితిలో ఉంది. ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్, వాట్సాప్, స్నాప్ చాట్ లాంటి సామాజిక మాధ్యమాలతో గడుపుతూ, విలువైన సమయాన్ని వృధా చేసుకుంటూ భవిష్యత్తు



కార్యాచరణ గురించి ఏమాత్రం ఆలోచించట్లేదు. ఇంట్లో తల్లిదండ్రులు వయసుతో సంభందం లేకుండా పిల్లలకి ఫోన్లు ఇవ్వడం న్యాయ సంభందం లేని నేరం వంటిది. ఎందుకంటే పిల్లలు ఫోన్ కి అలవాటు అయ్యేది ఇక్కడి నుంచే కాబట్టి. వాళ్ళు పాడై పోవడానికి ఫోన్ అనే వస్తువు ద్వారా భీజం వేసేది తల్లిదండ్రులే కాబట్టి. పాఠశాల వయసు నుంచే సామాజిక మాధ్యమాలలో కనిపించడం, లేదా తమ స్నేహితులు కనపడితే ఇష్టపడటం లాంటి చిన్న చిన్న వినోదాలు వ్యసనంగా మారాయి. ఇన్స్టాగ్రామ్ రీల్స్,



యూట్యూబు షార్ట్స్ లో వీడియోలు పెట్టడం లైక్ లు షేర్ లు కోసం పదే పదే చూస్తూ గంటల కొద్దీ సమయం వృదా చేస్కోవడం ప్రస్తుతం జరుగుతుంది. దాని వల్ల జీవితం గురించి క్షణం కూడా ఆలోచించలేని స్థితికి మెదడు నిర్వీర్యం చేయబడుతుంది. విద్యార్థుల చదువులో నాణ్యత లోపించింది. చదువు మీద ఆసక్తి తగ్గిపోయింది. చివరికి చదువు మానేసి గంటల కొద్దీ సామాజిక మాధ్యమాల్లో ఉంటూ, స్నేహితులతో చాటింగ్ చేస్తూ, ఫోన్ లో ఆటలు ఆడుతూ వేరే ప్రపంచంలో బతుకుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా డబ్బులు సంపాదించే వరి గురించి ఎలాంటి చింతన లేదు. ఎందుకంటే అది వాళ్ల ఆదాయ మార్గం. ఇక్కడ బాధ అంతా ఎవరో పెట్టిన వీడియోలు చూస్తూ భవిష్యత్తు గురించి భయం లేకుండా సమయం వృధా చేసే వారి గురించే. ఈ సామాజిక మాధ్యమాల వ్యసనం మానసిక ఆరోగ్యానికి చాలా హాని చేస్తుంది. ఆత్మ విశ్వాసం మీద దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మంచి దుస్తులు, నగలు ధరించి పార్టీలకు, ప్రయాణాలకు, పెద్ద పెద్ద కార్లలో, షిప్ లలో పోయే వారి వీడియోలు చూసి తమ జీవితం చాలా దరిద్రంలో ఉందనే ఆత్మన్యూనతా భావంతో చాలా మంది బతుకుతున్నారు. డిప్రెషన్, మానసిక ఆందోళన వంటి మానసిక వ్యాధులకు గురి అయ్యే వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతూ ఉంది. దాని వల్ల యువతలో మానసిక దృఢత్వం కోల్పోయి, చదువులో, ప్రేమలో, జీవితంలో ఓడిపోయినపుడు ఆత్మహత్యలకు ప్రేరేపితం అవ్వడం జరుగుతుంది. ఎక్కువ సేపు చూడటం వల్ల చూపు మందగిస్తుంది. ఎక్కువ సేపు వినడం వల్ల వినికిడి సామర్థ్యం మందగిస్తుంది. ఎక్కువ సేపు తల వంచి ఫోన్ చూడటం వల్ల మెడ నరాలు ఒత్తిడికి గురై మెడ నొప్పి, వెన్ను నొప్పి వంటివి వస్తున్నాయి. ఎక్కువ సేపు చేత్తో పట్టుకునే అవసరం లేకుండా ఫోన్ పెట్టుకోవడానికి పరికరాలు తెచ్చుకుని, కూర్చునే చోటే బల్ల మీద పెట్టి చూడటం వల్ల దేహానికి కావాల్సిన కదలిక ఉండక మధుమేహం లాంటి వ్యాధులు వస్తున్నాయి. ప్రయాణంలో వాహనానికి పెట్టి అపుడు కూడా ఫోన్ చూడటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కడ ఉన్నా ఎంత మంది ఉన్నా ఫోన్ చేతిలోనే ఉంటుంది. బొటన వేలు రీల్స్ ని పైకి తోస్తూనే ఉంటుంది. స్నేహితులే కాదు కుటుంబ సభ్యులది కూడా ఇదే ధోరణి. ఇంకొక ఇబ్బంది సైబర్ బెదిరింపులు. చదువుకున్న వారితో పాటు, చదువుకొని వారు కూడా సైబర్ బెదిరింపులకు గురి అవుతున్నారు. సామాజిక మాధ్యమాలలో పెట్టిన చాయాచిత్రాలను నగ్నంగా మార్చి డబ్బు కోసం బెదిరించడం చాలా చోట్ల జరిగింది. సామాజిక మాధ్యమాలలో అత్యాశకు దారి తీసే ప్రకటనలు, లాటరీ వంటి లింకులను నొక్కడం వల్ల ఫోన్ లు సైబర్ నెరగాళ్ల అధీనంలోకి వెళ్ళి పోయి బెదిరింపులకు గురి అవడం కూడా జరుగుతుంది. అయితే, సామాజిక మాధ్యమాలలో వచ్చే ప్రతీ విషయం చెడు చేయదు. ప్రతీ దాని మీద అవగాహన కలిగించే మంచి విషయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా పరీక్షలు రాశి ఉద్యోగాలు సంపాదించిన వాళ్ళు ఉన్నారు. కాబట్టి, వీటిని సరైన రీతిలో యువత అభివృద్ధి చెందాటానికి ఉపయోగించుకోవాలి తప్ప చెడి పోవటానికి కాదు. సామాజిక మాధ్యమాలు సమయం వృధా చేసుకోడానికి కాకుండా మంచి కోసం ఉపయోగించుకునేలా డిజిటల్ అక్షరాస్యత మరియు మనో విజ్ఞాన శాస్త్ర విద్యను అవలంబించాలి. తల్లిదండ్రులు, పాఠశాలలు పిల్లలకు సామాజిక మాధ్యమాలు ఎలా వాడాలో ఎందుకు వాడాలో నేర్పించాలి. సామాజిక మాధ్యమాల ఉపయోగాలు, దుష్ప్రభావాల మధ్య వ్యత్యాసాలని వివరించాలి. దేశ అభివృద్ధి యువత చేతుల్లోనే ఉంది కాబట్టి యువతని కాపాడుకోవటం అందరి భాధ్యత.

- రామ్ సంకుల
- రిసెర్చ్ అనలిస్ట్
9603939033

## 22 ఏళ్ల తర్వాత అపూర్వ విద్యార్థుల కలయిక



**కరపత్రం ప్రతినిధి బెజ్జంకి:**
బెజ్జంకి మండలం బేగంపేటలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల కలయికకు వేదిక అయింది. 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని సందడిగా నిర్వహించారు. 22 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు ఒకే వేదిక పైకి చేరడంతో చాలా సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఒకరిని ఒకరు ఆత్మీయ పలకరింపులతో యోగా క్షేమాలు తెలుసుకుంటూ ఆనాడు కలిసి చదువుకున్నా తీపి గుర్తులు నేమరేసుకున్నారు. తమ ఉన్నత స్థానాలకు కారణమై విద్యా బుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. నృత్యాలతో సందడి చేస్తూ ఆనందంగా గడిపారు. స్వీయ చిత్రాలు దిగుతూ సహా పంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ చిన్నారి మృతి

**వర్గల్ మే 18, కరపత్రం ప్రతినిధి**



ఆట బొమ్మలు తో ఆడుకుంటూ నోట్లో పెట్టుకుని శ్వాస ఆడక హాస్పటల్ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు గౌరారం ప్రొబేశనరి ఎస్సై కీర్తి రాజు వివరాలు తెలియపరుస్తూ హరియానాకు చెందిన ష్యాట్కబఖాన్ నాచారం గ్రామస్థుడైనా ఉంగరాల నర్సింలు యొక్క జెసిబి పై నాలుగు నెలలు గా డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. తన కుమార్తె అనబియా వయస్సు (14నెలలు) శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆట వస్తువుల తో ఆడుకుంటు ప్రమాదవషత్తు ఆట బొమ్మకు సంబంధించిన పిన్ను లాంటి వస్తువును నోట్లో పెట్టుకొని మింగగా శ్వాస తీసుకోడంలో ఇబ్బంది ఉండగా వెంటనే ఆర్విఎం హాస్పిటల్ తీసుకెళ్లరు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం నీలోఫర్ హాస్పిటల్ తీసుకెళ్లగా చికిత్స పొందుతు ష్యాట్కబఖాన్ కూతురు ఆదివారం ఉదయం 05:40 గంటలకు మృతి చెందినట్లు తెలిపారు ఇట్టి మృతి పై మృతురాలి తండ్రి ష్యాట్కబఖాన్ ఇచ్చిన పిర్యాదు పై ప్రమాదవశాత్తు మరణం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుంది

## మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం

### - బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మే 18 కరపత్రం ప్రతినిధి**



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి "శ్రీ బాలాజీ వెస్ట్ కౌంటీ" లో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆదివారం పర్యటించి కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాలనీలో నెలకొని ఉన్న భూగర్భ డ్రైనేజీ సమస్యతో పాటు వివిధ రకాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రాఘవేంద్ర రావు, నాయకులు సాంబశివ రావు, బొబ్బ శ్రీనివాస్, సతీష్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు...

## సీఎం గారూ.. యుద్ధంలో ఉన్నా.. రాలేకపోతన్న..!!

### - సిఎం కు జమ్మూకశ్మీర్ నుంచి ఓ సెల్ఫీ వీడియో ద్వారా జవాన్ విజ్ఞప్.

**దుబ్బాక: 'సిద్ధిపేట ప్రతినిధి మే18 కరపత్రం ప్రతినిధి**
దేశ సరిహద్దుల్లో శత్రువులతో నేను పోరాడుతుంటే.. సొంతూరులో భూమిని కబ్జా చేసిన అక్రమార్కులతో నా తల్లిదండ్రులు పోరాడాల్సి వస్తోంది' అని సిద్ధిపేట జిల్లాకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ బూర రామస్వామి వాపోయాడు. తన భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జమ్మూకశ్మీర్ నుంచి శనివారం ఓ సెల్ఫీ వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా భూంపల్లి-అక్బర్‌పేట మండలం చౌదర్‌పల్లికి చెందిన



రామస్వామి తన భూమి కబ్జా అయిన తీరును ఆ వీడియోలో వివరించాడు. '1992లో ధర్మాజీపేట శివారులోని 406 సర్వే నంబర్‌లో నా తల్లిదండ్రులు 1.16 ఎకరాల భూమిని సాదాబైనామా కింద కొనుగోలు చేశారు. ఆ భూమిని నా గ్రామానికే చెందిన వీఆర్వో రమేష్.. తన సోదరుల పేరిట రికార్డుల్లోకి ఎక్కించుకున్నాడు. భూమి గురించి అడిగితే వీఆర్వో బంధువులు నా తల్లిదండ్రులను బెదిరిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మా భూమిని మాకు దక్కేలా చేయాలి'అని వేడుకున్నాడు. ఈ వీడియోపై స్పందించిన బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు.. వెంటనే జిల్లా కలెక్టర్ మనుచౌదరికి ఫోన్ చేసి జవాన్ భూ సమస్యను పరిష్కరించాలని కోరారు. తన ఎక్స్ ఖాతాలో కూడా ఆ వీడియోను పోస్ట్ చేశారు. దీంతో రెవెన్యూ యంత్రాంగంలో వెంటనే స్పందించింది. శనివారం సాయంత్రం భూంపల్లి తహసీల్దార్ మల్లిఖార్జున్, ఆర్ఐ తదితరులు పంచనామా నిర్వహించి కలెక్టర్‌కు నివేదించారు.

## పురుషుల పాలిట మృత్యు ఘంటికలు మోగిస్తున్న 'బ్రోకెన్ హార్ట్ సింద్రోమ్'!

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**
బ్రోకెన్ హార్ట్ సింద్రోమ్' తో మహిళల కన్నా పురుషులకే అధిక మరణాలు పురుషుల్లో మరణాల రేటు 11.2%, మహిళల్లో ఇది 5.5%గా నమోదు టకోత్సుబో కార్డియోమయోపతీ లక్షణాలు గుండెపోటును పోలి ఉంటాయి తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడి ఈ వ్యాధికి ప్రధాన కారణం సాధారణంగా "బ్రోకెన్ హార్ట్ సింద్రోమ్"గా పిలిచే టకోత్సుబో కార్డియోమయోపతీ విషయంలో ఓ కీలకమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యాధి బారిన పడుతున్న వారిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, మరణాల రేటు మాత్రం పురుషుల్లోనే రెండు రెట్లకు పైగా అధికంగా ఉన్నట్లు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ తాజా అధ్యయనం స్పష్టం చేసింది. ఈ పరిస్థితి వైద్య నిపుణులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అధ్యయనంలో వెల్లడైన వాస్తవాలు 2016 నుంచి 2020 మధ్య కాలంలో అమెరికాలోని వివిధ ఆసుపత్రుల్లో టకోత్సుబో



కార్డియోమయోపతీతో బాధపడుతూ చికిత్స పొందిన దాదాపు 2 లక్షల మంది రోగుల డేటాను పరిశోధకులు విశ్లేషించారు. ఈ విశ్లేషణలో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. మొత్తం కేసుల్లో 83 శాతం మహిళలే ఉన్నప్పటికీ, వ్యాధి తీవ్రత మరణాల రూపంలో పురుషుల్లో ఎక్కువగా కనిపించింది. పురుషుల్లో మరణాల రేటు 11.2 శాతంగా ఉండగా, మహిళల్లో ఇది 5.5 శాతంగా మాత్రమే నమోదైంది. మొత్తం మీద ఈ వ్యాధి కారణంగా మరణాల రేటు 6.5 శాతంగా ఉందని, ఐదేళ్ల అధ్యయన కాలంలో ఇందులో పెద్దగా మార్పు లేకపోవడం ఆందోళనకరమని నిపుణులు పేర్కొంటున్నారు. ఏమిటీ టకోత్సుబో కార్డియోమయోపతీ? టకోత్సుబో కార్డియోమయోపతీ అనేది ఓ తాత్కాలిక గుండె జబ్బు. తీవ్రమైన మానసిక లేదా శారీరక ఒత్తిడికి గురైనప్పుడు ఇది సంభవిస్తుంది. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు గుండెపోటును పోలి ఉంటాయి. చాలా సందర్భాల్లో ఇది నయం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, కొన్నిసార్లు ఇది కంజెషన్ వల్ల కలిగే గుండె వైఫల్యం, కార్డియోజెనిక్ షాక్, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీయవచ్చు.

## మళ్లీ విజృంభిస్తున్న కరోనా: సింగపూర్‌లో 14 వేల కేసులు :

### - హాంకాంగ్‌లో హై అలర్ట్..!!

**అంతర్జాతీయ న్యూస్ మే18 కరపత్రం ప్రతినిధి**
Covid Cases Surge: రెండేళ్ల కిందట ప్రపంచాన్ని చుట్టేసిన కరోనా వైరస్ కోట్ల మంది ప్రాణాలను హరించంగా లక్షల కుటుంబాల్లో కన్నీటిని మిగిల్చిన సంగతి తెలిసిందే. అయితే ప్రపంచం ఆ కుదుపు నుంచి ఇంకా తేరుకోక మునుపే మరోసారి కరోనా వైరస్ క్రైసులు విపరీతంగా పెరగటం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా ఆసియాలోని హాంకాంగ్, సింగపూర్ ప్రాంతాల్లో కరోనా కేసులు విపరీతంగా పెరుగుతున్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి ప్రజలు ఎక్కువగా ఉండే ఈ ఫైనాన్షియల్ హబ్ లలో పెరుగుతున్న కరోనా కేసులపై అక్కడి అధికారులు అందరినీ అప్రమత్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులు చూస్తుంటే ఆసియాలో మరోసారి కోవిడ్ వేవ్ ప్రభలే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా హాంకాంగ్ నగరంలో కేసులు తారా స్థాయిల్లో పెరుగుతున్నాయని నగరంలోని సెంటర్ ఫర్ హెల్త్ ప్రొటెక్షన్ కమ్యూనికేషన్ డిసీజ్ బ్రాంచ్ అధిపతి ఆల్బర్ట్ ఔ



పేర్కొన్నారు. ప్రస్తుతం చేస్తున్న కోవిడ్ టెస్టుల్లో అత్యధికంగా పాజిటివ్ రావటంతో కేసులు ఏడాది గరిష్ఠాలకు చేరాయని హాంకాంగ్ అధికారులు చెబుతున్నారు. వైరస్ తీవ్రంగా ప్రభావితం చేసిన కేసులతో పాటు మరణాల సంఖ్య కూడా భారీగా పెరిగిందని డేటా చెబుతోంది. ప్రస్తుతం 70 లక్షల మంది నివసిస్తున్న నగరంలో పరిస్థితులు చేజారి గతంలో స్థాయికి చేరలేదని అయితే కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోందని వెల్లడైంది. ఇదే సమయంలో సింగపూర్ నగరంలో కూడా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ నెలలో కరోనా కేసులు భారీగా పెరిగినట్లు వెల్లడించింది. మార్చి 3 నాటికి కేసుల సంఖ్య 14వేల 200గా ఉన్నట్లు ప్రకటించింది. రోజూ వైరస్ భారీన పడటం కారణంగా ఆసుపత్రి పాలవుతున్న వ్యక్తుల సంఖ్య 30 శాతం వరకు పెరిగింది. అయితే ప్రస్తుతం సివియర్ కేసుల సంఖ్య చాలా తక్కువగానే ఉందని హెల్త్ అధికారులు వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థలు ఇప్పుడిప్పుడే ప్యాండమిక్ కాలంలో జరిగిన నష్టం నుంచి తిరిగి కోలుకుంటున్న ప్రస్తుత సమయంలో కరోనా కేసులు మళ్లీ పెరగటం ప్రపంచ దేశాలను తిరిగి ఆందోళనల్లోకి నెట్టేస్తోంది